సాక్షి
కర్నూలు
సోమవారం । 25 । నవంబర్ । 2024



అన్న ప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం కాకినాడకు చెందిన వీరుదయ్‌కుమార్ రూ.1,00,011 విరాళం అందించారు.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం విజయవాడకు చెందిన నటరాజ నృత్యాలయం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.28
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 95.340
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,118
అవుట్ ఫ్లో	: 6,798

న్యూస్‌రీల్

తూతూ మంత్రంగా ఓటరు ప్రత్యేక క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్-2025కు సంబంధించిప్రత్యేక ఓటరు క్యాంపులను ఎన్నికల అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. పాణ్యం, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరులో ఓటరు నమోదు కోసం ఒక్క ఫారం-6 దరఖాస్తును స్వీకరించ లేదంటే అధికారులు ఏ మాత్రం పని చేసి ఉంటారో తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల్లో ఫారం 6, 7, 8లు కలిపి మొత్తం 1,344 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 2,203 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించగా ఫారం-6 కింద 452, ఫారం-7 కింద 196, ఫారం-8 కింద 493 మొత్తం 1,344 దరఖాస్తులను మాత్రమే అధికారులు స్వీకరించారు. స్థానికంగా సరైన ప్రచారం లేకపోవడంతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త దరఖాస్తులు పెద్దగా రాలేదు.

టమాట ధర పైపైకి!

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరకు రెక్కలు వస్తున్నాయి. రబీలో టమాట సాగు తగ్గిపోవడం, వచ్చిన టమాట దిగుబడులు ఇతర ప్రాంతాలకు తరలుతుండటంతో మార్కెట్‌లో కొరత ఏర్పడుతోంది. దీంతో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కర్నూలు రైతు బజారులో కిలో ధర రూ.30 ఉండగా.. బయట కిలో రూ.50 ఆపైన ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ధర మరింత ఎక్కువగా ఉంది. రబీలో టమాట సాధారణ సాగు 511 హెక్టార్లు ఉండగా.. కేవలం 136 హెక్టార్లలో మాత్రమే సాగు అయింది. టమాటతో సహా కూరగాయల సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో సాగు తగ్గింది. డిమాండ్ పెరిగింది. ఆదివారం పత్తికొండ మార్కెట్‌కు కేవలం 37 టన్నులు మాత్రమే వచ్చింది. ఒక దశలో ఈ మార్కెట్‌కు 80 టన్నులకు పైగా వచ్చింది. సగానికి పైగా తగ్గడంతో ఈ ప్రభావం ధరలపై పడుతోంది. క్వింటాకు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,200 లభించింది.సగటు ధర రూ.2,500 నమోదు అయింది. రానున్న రోజుల్లో టమాట ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హంద్రీనీవా నుంచి జీడీపీకి నీటి విడుదల




కర్నూలు సిటీ: హంద్రీనదిపై నిర్మించిన గాజులదిన్నె ప్రాజెక్టు (దామోదరం సంజీవయ్య సాగర్)లో నీటి నిల్వలలు తగ్గిపోతుండడంతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా హంద్రీనీవా కాలువ నుంచి ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు నీటి లభ్యత లేక కేవలం తాగు నీటి అవసరాలు తీర్చే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులా మారింది. దీంతో హంద్రీనీవా కాలువ ఏర్పాటైన తర్వాత 11.40 కి.మీ దగ్గర అదనపు స్లూయిజ్ ఏర్పాటు చేసి సంవత్సరంలో కాల్వలో ఎన్ని రోజులు నీటి ప్రవాహం ఉంటే అన్ని రోజుల పాటు 3 టీఎంసీల నీటిని ఇచ్చేలా గతంలో కేటాయింపులు చేశారు. అయితే రోజుకు 230 క్యూసెక్కులకు పైగా నీటిని స్లూయిజ్ నుంచి విడుదల చేయాలి. కేవలం 100 క్యుసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఇలా అయితే 3 టీఎంసీల నీరు వచ్చేందుకు ఎన్ని రోజులు పడుతుందని ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

రేపు సాగు నీటి సలహా మండలి సమావేశం

కర్నూలు సిటీ: జిల్లాలో సాగు నీటి జలాశయాల్లో నీటి నిల్వను బట్టి రబీ సీజన్‌లో సాగు చేసే ఆయకట్టుకు నీటి విడుదలపై చర్చించేందుకు ఈ నెల 26వ తేదీ (మంగళవారం) సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జల వనరుల శాఖ ఇంజినీర్లు తదితరులు హాజరుకానున్నారు.





రోడ్డున పడిన కుటుంబం



ఇతని పేరు బి. నాగరాజు (38). చిప్పగిరి మండలం బంటన్‌హాల్ గ్రామానికి చెందిన ఈయనకు సొంత భూమి 4.38 ఎకరాలు ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో మిరప సాగు చేశారు. ఒకవైపు వర్షాభావం, మరో వైపు అధిక వర్షాలతో పంట దెబ్బతినింది. బ్యాంకులో రూ.80 వేలు, ప్రైవేటు అప్పు 14.50 లక్షలు ఉంది. వీటిని తీర్చే మార్గం కనిపించక పోవడంతో సెప్టెంబరు 22న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిని మండల స్థాయి అధికారులు తహసీల్దారు, సబ్ ఇన్‌స్పెక్టరు, మండల వ్యవసాయ అధికారి ప్రాథమికంగా నిర్ధారించి రిపోర్టు కూడా పంపారు. త్రీమెన్ కమిటీ ఎప్పుడు విచారణ జరుపుతుందనేది తెలియడం లేదు. సంపాదించే వ్యక్తి మరణించడంతో బాధిత కుటుంబం మాత్రం రోడ్డున పడింది.

భర్త చనిపోవడంతో వలస బాట



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు గూడూరుకు చెందిన నల్లబోతుల చిన్న రామాంజనేయులు(37). సొంతభూమి 3.67 ఎకరాలు ఉంది. మరో 3.42 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు.ఈ సారి పత్తి, కొర్ర పంటలు సాగు చేశారు. అధిక వర్షాలు, వర్షాభావం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా దక్కలేదు. వ్యవసాయం కోసం రూ.8 లక్షలు అప్పు చేశారు. పంటలు పండకపోవడం..అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో సెప్టెంబరు 9న బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో బాధిత కుటుంబం వీధిన పడింది. జీవనం భారంగా మారింది. దిక్కుతోచని పరిస్థితిలో స్థానికంగా బతకలేక భార్య పిల్లలు గుంటూరుకు వలస వెళ్లారు.

సాగు భారమై.. చావు శరణ్యమై!

ఆరు నెలల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో 45 మంది రైతుల బలవన్మరణాలు

- మళ్లీ 2014 -19 నాటి పరిస్థితులు ఉత్పన్నం
- ఈ ఏడాది కలిసి రాని వ్యవసాయం
- దక్కని పెట్టుబడులు.. ఆదుకోని ప్రభుత్వం
- అప్పుల బాధతో ప్రాణాలు తీసుకుంటున్న రైతన్నలు
- బాధిత కుటుంబాలకు అందని పరిహారం
- వైఎస్సార్‌సీపీ హయాంలో సత్వరం చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): 2014 నుంచి 2019 వరకు కొనసాగిన రైతుల బలవన్మరణాల పరంపర మళ్లీ మొదలైంది. నాటి టీడీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 321 మంది కర్షకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో 2019 ఎన్నికల్లో రైతులు చంద్రబాబును నమ్మలేదు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆయన కొత్త పల్లవి ఎంచుకున్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు సాయం అందిస్తామని ప్రకటించారు. సూపర్-6 హామీల్లో దీనిని చేర్చి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. రైతులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు మరోసారి నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. బాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. ఇప్పటి వరకు రైతుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు శూన్యం. ఖరీఫ్ సీజన్ దాటిపోయి రబీ సీజన్ వచ్చినా పెట్టుబడి సాయం అందించలేదు. దీనికితోడు ఈసారి పంటలు సరిగ్గా పండలేదు. ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

సాయం కోసం ఎదురు చూపు...

ఇక్కడ మహిళా రైతు సువర్ణ చిత్ర పటం చూపుతున్న కుటుంబానిది కృష్ణగిరి మండలం, పందిర్లపల్లె గ్రామం. పేద కుటుంబం. నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. ఇందులో ఈ ఏడాది వేరుశనగ, ఆముదం పంటలు సాగు చేశారు. కాలం కలిసిరాకపోవడంతో పంటలు పండలేదు. పెట్టుబడులకు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. దీనిని ఎలా తీర్చాలని భర్త పాండుతో కలిసి సువర్ణ మదన పడేది. ఇంట్లో ఉన్నా, పొలానికి వెళ్లినా వారిద్దరి మధ్య ఇదే ఆలోచన. చివరకు దిక్కుతోచక సువర్ణ ఆగస్టు నెలలో పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండల స్థాయి అధికారుల ప్రాథమిక విచారణలో మహిళా రైతు ఆత్మహత్యగా నిర్ధారించినప్పటికీ ప్రభుత్వం నుంచి చేయూత కరువైంది.



ఆరు నెలల్లోనే 45 మంది రైతులు ఆత్మహత్య

ఈ ఏడాది జూన్ నెలలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ స్వల్ప వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో 45 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 18 మంది ప్రాణాలు తీసుకున్నారు. 2024-25లో వ్యవసాయం కలసి రాలేదు. ఒకవైపు వర్షాభావం, మరోవైపు అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా పత్తి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న తదితర పంటల్లో అధిక వర్షాలు, వర్షాభావం వల్ల దిగుబడులు పడిపోయాయి. అంతంత మాత్రం వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పటికీ కనీసం మద్దతు ధరతోనైనా అమ్ముకునే అవకాశం కూడా లేకుండా పోయింది. మరోవైపు కరువు మండలాలను గుర్తించడంలో ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం వహించింది. కేవలం పెద్దకడబూరు, కౌతాళంను కరువు మండలాలుగా గుర్తించి, మిగిలిన మండలాలను గాలికి వదిలేసింది. నంద్యాల జిల్లాలోని డోన్ నియోజక వర్గం పూర్తిగా వర్షాధారంపై మాత్రమే ఆధారపడింది. నంద్యాల జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా గుర్తించలేదు. ఇలా ప్రభుత్వ సాయం లేక.. వ్యవసాయం కలసిరాక రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

బాధిత కుంటుబాలకు కరువైన చేయూత

బలవన్మరణాలకు పాల్పడిన రైతు కుటుంబాలకు చేయూత కరువైంది. రైతులు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ అవుతుంది. దీనిపై మండల వ్యవసాయ అధికారి విచారణ జరిపి ప్రాథమిక రిపోర్టును జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపుతున్నారు. ఇప్పటి వరకు 45 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు మండల స్థాయి కమిటీ అధికారులైన సబ్ ఇన్‌స్పెక్టర్, తహసీల్దారు, వ్యవసాయ అధికారి ధ్రువీకరిస్తూ ప్రాథమిక రిపోర్టులు పంపినట్లు స్పష్టమవుతోంది. దీనిపై త్రీమెన్ కమిటీ విచారణ జరపాలి. ఈ కమిటీలో ఏడీఏ, ఆర్డీఓ, డీఎస్పీలు ఉంటారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడినప్పటికీ జిల్లాలో త్రీమెన్ కమిటీల జాడే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన యాప్ ఓపన్ కాలేదు. త్రీమెన్ కమిటీ విచారణకు సంబంధించిన అంశాలు, డాక్యుమెంట్లను అందులో అప్‌లోడ్ చేయాలి. ఇంత వరకు యాప్ ఇవ్వకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలకు చేయూత దక్కేది అనుమానంగా మారింది.



వ్యవసాయ శాఖ సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో రైతు ఆత్మహత్యల వివరాలు...

నెల	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
ఏప్రిల్	1	2
మే	2	-
జూన్	2	2
జూలై	1	-
ఆగస్టు	4	6
సెప్టెంబరు	9	2
అక్టోబరు	1	4
నవంబరు	7	2
మొత్తం	27	18

వైఎస్సార్‌సీపీ హయాంలో సత్వరమే సాయం

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు చెల్లించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచింది. మరణించిన రైతు నామినీ బ్యాంకు ఖాతాకు నేరుగా పరిహారాన్ని జమ చేసింది. త్రీమెన్ కమిటీ రిపోర్టు అందిన నెల రోజుల్లోపే పరిహారం విడుదల అయ్యేది. ఇది రైతు కుటుంబాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది. 2014- 2019 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించలేదు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 180 మంది రైతుల బలవన్మరణాలను త్రీమెన్ కమిటీ నిర్ధారించినప్పటికీ పరిహారం ఇవ్వడానికి బాబు సర్కారుకు మనసొప్ప లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఆ 180 రైతు కుటుంబాలకు రూ.5 లక్షల ప్రకారం రూ.9 కోట్లు పరిహారం పంపిణీ చేసి ఆదుకుంది.

కమీషన్ ఏజెంట్ల అడ్డగోలు దోపిడీ

- తక్‌పట్టీ కాదని అదనంగా వసూళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు దోపిడీకి పాల్పడుతున్నారు. యార్డులో దాదాపు 80 శాతం ఏజెంట్లు రైతులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. మార్కెట్ కమిటీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కమీషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నెల 23వ తేదీన డోన్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే రైతు 30 బ్యాగుల వేరుశనగను యార్డులోని ఈ.రమేష్‌గౌడుకు చెందిన మల్లికార్జున ట్రేడర్స్‌కు తెచ్చారు. ధర క్వింటాలుకు రూ.5,379.89 లభించింది. వేరుశనగకు వచ్చిన మొత్తం రూ.87,100. తక్‌పట్టీలో లెక్కల ప్రకారం హమాలీ, లేబర్ చార్జీలతో పాటు కమీషన్ ఏజెంటు కమీషన్ రూ.2331.27 మినహాయించుకొని రైతుకు రూ.84,769.15 చెల్లించాల్సి ఉంది. కమీషన్ ఏజెంటు అసోషియేషన్‌కు, కార్మిక సంఘాల పేరుతో తక్‌పట్టీలో వచ్చిన మొత్తానికి అదనంగా రూ.780 కోత పెట్టడంతో రైతు తిరుగబడ్డాడు. 'కమీషన్ ఏజెంట్ల సంఘంతో మాకేమి సంబంధం' అంటూ ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తే తగ్గించి చివరికి రూ.369 అదనంగా వసూలు చేశారు. సాధారణంగా పంట ఉత్పత్తులను విక్రయించిన ప్రతి రైతుకు ఈ-నామ్‌లో జనరేట్ అయిన తక్‌పట్టీ ఇవ్వాల్సి ఉంది. తక్‌పట్టీలో రైతు తెచ్చిన పంటకు సంబంధించి సమగ్ర సమాచారం ఉంటుంది. హమాలీ చార్జీలు, ఏజెంటు కమీషన్ పోనూ రైతుకు ఎంత చెల్లించాలనే వివరాలు ఉంటాయి. కాని పలువురు కమీషన్ ఏజెంట్లు తక్‌పట్టీలో వచ్చిన వాటికి విరుద్ధంగా రైతుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. కమీషన్ ఏజెంట్లు సంఘం, లేబర్ సంఘాల పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తుండటం గమనార్హం. కొందరు రైతులు ఎందుకు కట్టాలని ప్రశ్నిస్తున్నా.. బైలాలోనే ఉందని బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



మార్కెట్ యార్డుకు వచ్చిన వేరుశనగ

ఐఏఎస్ ఆఫీసర్ల అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కలెక్టర్



కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ఐఏఎస్ ఆఫీసర్ల అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో స్పెషల్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో కలెక్టర్ పి.రంజిత్‌బాషా జాయింట్ సెక్రటరీగా ఎంపిక అయ్యారు. దీంతో పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజుకోసం ఒత్తిడి చేస్తే చర్యలు

కర్నూలు(సెంట్రల్): ఫీజులు చెల్లించలేదనే కారణంతో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులను పరీక్షలకు, తరగతులకు హాజరు కాకుండా అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తే సహించబోమని, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. అంతవరకు విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బందిపెట్టొద్దని సూచించారు.



సచివాలయంలో ఉంచిన వంటసామగ్రి



సచివాలయ కుర్చీలపై ఆరబెట్టిన దుస్తులు

సత్రం కాదు సచివాలయమే

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఊరూరా గ్రామ/వార్డు సచివాలయాలు నిర్మించి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తుంది. ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. సచివాలయాల నిర్వహణను గాలికి వదిలేసింది. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామంలోని సచివాలయాన్ని అధికార పార్టీ నాయకులు సత్రంగా మార్చారు. సీసీ రోడ్లు వేసేందుకు వచ్చిన కూలీలకు సచివాలయం కింది భాగం అప్పగించారు. వారు ఆ గదిలో వంటవార్పు చేసుకోవడంతో పాటు కార్యాలయ ఫర్నీచర్‌పై దుస్తులు ఆరబెడుతున్నారు. వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చిన ప్రజలు ఇది సచివాలయమా..సత్రమా అని చర్చించుకుంటున్నారు. – పాణ్యం



స్పెల్‌బీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థి, విద్యార్థినులు

ఆంగ్లనైపుణ్యం.. గణిత మేధస్సు

సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రవీంద్ర విద్యానికేతన్‌లో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పరీక్షలు తమ భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తాయని, పై తరగతుల్లో రాణించేందుకు దోహద పడతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

- వివరాలు 8లో▸



నంద్యాలలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న మహిళలు



కర్నూలులో లెమన్ స్పూన్ ఆటలో పాల్గొన్న మహిళలు



సూర్యనందిలో ఆపస్ సంఘం ఆధ్వర్యంలో వన భోజనం

వన భోజనం.. జన రంజనం!

వనభోజనాల ఆత్మీయ సమ్మేళనంలో ఐక్యతా రాగం వెల్లివిరిసింది. ఆనందాల రుచులు ఘుమఘుమలాడాయి. కమ్మని సంతోషాలు కడుపునిండా పంచుకున్నారు. ఆకాశమే హద్దుగా చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కార్తీక మాసం చివరి ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వన భోజనాల సందడి కనిపించింది. కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, చిన్నాపెద్దా తేడా లేకుండా ఆటపాటలతో గడిపారు. ఆ తర్వాత కమ్మని రుచులతో వన భోజనాలు చేసి ఆనందంగా ఇంటికి చేరుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

విహారయాత్రకు వెళ్లి మృత్యువాత

ఆళ్లగడ్డ: విహారయాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి కొంతమంది ప్రైవేటు టూరిస్టు బస్సు తీసుకొని వారణాసి తదితర ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లారు. ఈ ప్రయాణంలో కౌశ్యాంబి వద్ద బస్సు బోల్తా పడ్డ ఘటనలో బత్తలూరు గ్రామానికి చెందిన శేషయ్య (65) అనే వ్యక్తి మృతి చెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పోగొట్టుకున్న సొమ్ము బాధితులకు అప్పగింత


బాధితులకు సొమ్ము అప్పగిస్తున్న సీఐ

కర్నూలు (టౌన్): పోగొట్టుకున్న సొమ్మును నాలుగవ పట్టణ పోలీసులు వెతికిపెట్టి బాధితులకు అప్పగించారు. ఈ వివరాలను ఆదివారం నాలుగవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన నంద్యాల జిల్లా సున్నిపెంటకు చెందిన కాత రామిరెడ్డి, దంపతులు కర్నూలు నగరంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి సున్నిపెంటకు వెళ్లేందుకు కర్నూలు బస్టాండ్‌లో బస్సు ఎక్కారు. వారి బ్యాగును బస్సులోనే మర్చిపోయారు. బ్యాగ్‌లో 6 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.12 వేలు నగదు ఉండటంతో బాధితులు నాలుగవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించి మూడు రోజుల్లో బ్యాగ్‌ను గుర్తించారు. బాధితులను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి సొమ్ము అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి


మహంకాళమ్మ (ఫైల్)

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని భీమాస్ సర్కిల్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన మహంకాళమ్మ (50) మృతిచెందింది. మృతురాలి బంధువులు ట్రాఫిక్ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకడబూరు మండలం తారాపురంలోని ఆంజనేయస్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఆదోని భీమాస్ సర్కిల్‌లో ఆటో వేగంగా వెళ్తూ అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. మహంకాళమ్మ తీవ్రంగా గాయపడడంతో బోల్తా పడిన ఆటోను లేపి అదే ఆటోలో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పత్రికా విలేకరిపై ఫిర్యాదు

ఆదోని అర్బన్: తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ పత్రికలో ప్రచురించిన ఓ పత్రికా విలేకరిపై కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన రాష్ట్ర మాజీ ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గుడిసె క్రిష్ణమ్మ ఆదివారం రాత్రి డీఎస్పీ సోమన్నకు ఫిర్యాదు చేశారు. వెంటనే విలేకరిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రూ. 40 వేలు మామూలు ఇవ్వలేదనే కారణంతోనే తనపై ఆరోపణలు చేస్తూ పదేపదే పత్రికల్లో కథనాలు ప్రచురించి తన పరువుకు భంగం కలిగించిన విలేకరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు డీఎస్పీ వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని త్రీ టౌన్ సీఐ రామలింగయ్యను ఆదేశించారు.

కరెంట్‌షాక్‌తో పాడిగేదె మృతి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్లలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఆదివారం ఓ పాడి గేదె మృతి చెందింది. రైతు దస్తగిరి మేతకోసం గేదెలను తీసుకుని పొలాల వైపు వెళ్లాడు. రైతు మల్లారెడ్డి పొలం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫారాన్ని ప్రమాదవశాత్తు గేదె తాకడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. జీవనాధరమైన రూ.70వేలు విలువగల పాడి గేదె మృతితో రైతు దస్తగిరి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.


మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు


స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆంగ్ల నైపుణ్యం.. గణిత మేధస్సు

- సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు విశేష స్పందన
- రెండో దశ పోటీలకు 118 మంది విద్యార్థుల హాజరు
- నాలుగు విభాగాలుగా విద్యార్థులను వర్గీకరించి నైపుణ్య పరీక్షలు
- ఎంతో ఉపయోగమని సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం నగరంలోని రవీంద్ర విద్యానికేతన్‌లో నిర్వహించిన పరీక్షలకు 118 మంది విద్యార్థులు హాజరవ్వగా.. గణితంలో సందేహాల నివృత్తి.. ఇంగ్లిష్‌లో కష్టమైన పదాలకు సులభంగా అర్థాలు నేర్చుకున్నారు. ఈ పరీక్షలు తమ భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తాయని, పై తరగతుల్లో రాణించేందుకు ఉపయుక్తంగా ఉన్నాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

నాలుగు విభాగాలుగా నైపుణ్య పరీక్షలు

'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయి తరగతుల విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే పరీక్షలకు వందలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ నేపథ్యాలు ఉన్నా విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని కనబరుస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో వారి తరగతి నైపుణ్యాలను బట్టి రెండో దశకు ఎంపిక చేస్తారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంగ్లిష్‌లో నైపుణ్యం సంపాదించుకోవాలని, మ్యాథ్స్‌లో పట్టు సాధించాలన్న దృఢ సంకల్పంతో స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలను ప్రతి సంవత్సరం 1, 2 తరగతుల విద్యార్థులను ఒక్క గ్రూపుగా 3, 4, 5 తరగతుల వారిని రెండో గ్రూపుగా 6, 7 తరగతుల విద్యార్థులను మూడో గ్రూపుగా 8, 9, 10 తరగతుల వారిని నాలుగో గ్రూపుగా వర్గీకరించి పరీక్షలు నిర్వహిస్తారు. రెండో దశలో ఎంపికైన విద్యార్థులకు రీజనల్ స్థాయిలో, అందులో ఎంపికైన వారికి ఫైనల్ స్థాయిలో పోటీ పరీక్షలు ఉంటాయి. ఆదివారం కర్నూలులో జరిగిన రెండో దశ పరీక్షలకు స్పెల్‌బీ నుంచి 63, మ్యాథ్స్‌బీ నుంచి 55 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్పెల్‌బీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ప్రనౌన్సియేషన్, కష్టమైన పదాలకు సులభంగా స్పెల్లింగ్‌లు రాయడం, స్పీచ్, లిజనింగ్ (వినడం) తదితర విభాగాల్లో పట్టు సాధిస్తారు. అలాగే మ్యాథ్స్‌బీ ద్వారా వారిలోని భయాన్ని తొలగించి చిన్న, చిన్న ట్రిక్కులతో సమస్యలను సులభంగా సాధన చేసేలా చేస్తారు.


స్పెల్‌బీ పరీక్ష రాసేందుకు వస్తున్న చిన్నారులు

స్పెల్ బీతో ఇంగ్లిష్‌లో పూర్తిస్థాయిలో నైపుణ్యం



స్పెల్‌బీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ప్రనౌన్సియేషన్, కష్టమైన పదాలకు సులభంగా అర్థాలు, స్పెల్లింగ్‌లు రాయడం, స్పీచ్, లిజనింగ్ (వినడం) తదితర విభాగాల్లో పట్టు సాధిస్తారు. తద్వారా వారు ఇంగ్లిష్‌లో పూర్తిస్థాయిలో నైపుణ్యం సాధిస్తారు. ఎన్నో మేలకువలు నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ఇలాంటి పరీక్షలు రాయించడం ద్వారా వారిలోని భయాన్ని తొలగించవచ్చు.
– జయకృష్ణ, ఇంగ్లిష్ టీచర్, రవీంద్రవిద్యానికేతన్, కర్నూలు

మ్యాథ్స్ బీతో భవిష్యత్‌కు పునాది వేసుకున్నా



నాలో చాలా భయం ఉండేది. దానిని పోగొట్టుకోవాలని అనుకుంటున్న తరుణంలో మ్యాథ్స్‌బీ గురించి విని వెంటనే నా పేరును నమోదు చేసుకున్నాను. సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ వారు ఇచ్చిన మెటీరియల్ చదివి చాలా ట్రిక్కులు నేర్చుకున్నాను. ఇప్పుడు నాకు మ్యాథ్స్ అంటే భయం లేదు. భవిష్యత్‌లో ఏ పరీక్షలోనూ మ్యాథ్స్ అంటే భయపడను. ఇది నా భవిష్యత్‌కు మంచి పునాది.
– హర్షిత, 9వ తరగతి, రవీంద్ర విద్యానికేతన్, కర్నూలు

థ్యాంక్స్ టూ 'సాక్షి'



నేను ముందుగా 'సాక్షి'కి థ్యాంక్స్ చెబుతున్నా. నాలో ఉన్న దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీసేందుకు 'సాక్షి' ముందడుగు వేయడం చాలా సంతోషం. నేను మ్యాథ్స్ బీ పరీక్షకు హాజరయ్యారు. మూడో దశకు వెళ్తానన్న నమ్మకం ఉంది. మ్యాథ్స్ అంటే నాకు భయం లేదు.
– అఖ్రియా, 4వ తరగతి రవీంద్ర విద్యానికేతన్, కర్నూలు

ఇంగ్లిష్ అంటే భయం పోయింది



నేను స్పెల్‌బీలో పాల్గొన్నా. నాకు స్పెల్లింగులు రాయడంలో చాలా ఇబ్బందిగా ఉండేది. వాటిని పలికే విధానంపై గందరగోళం ఉండేది. ఇక్కడ ఒక పదాన్ని ఎలా రాయాలి, ఎలా పలకాలన్న దానిపై స్పష్టంగా వివరించారు. దీంతో ఇక ఏ పదాన్నైనా సులభంగా పలికేస్తా, రాసేస్తా. ఇంగ్లిషు అంటే భయం పోయింది.
–లేఖ, 9వ తరగతి, ఎడిఫై స్కూలు, కర్నూలు

ఇంగ్లిష్‌లో పట్టు సాధించా



నేను ఇంగ్లిష్‌లో మంచి పట్టుసాధించా. వొకాబులరీ, స్పీచ్, లిజనింగ్, స్పెల్లింగులు ఎన్నో నేర్చుకున్నా. గతంలో ఉన్న ఎన్నో అనుమానాలకు స్పెల్ బీతో సమాధానాలు తెలిశాయి. భవిష్యత్‌లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ అంటే భయపడను. నాకు ఏకాగ్రత కుదిరింది.
– రాహుల్, 8వ తరగతి, రవీంద్ర విద్యానికేతన్, కర్నూలు

స్పెల్ బీతో ఎంతో ఉపయోగం



స్పెల్‌బీతో ఎంతో ఉపయోగం ఉంది. ఉన్న తరగతిలోనే పైతరగతి సిలబస్‌పై పట్టు సాధించవచ్చు. అక్కడ మనం టాపర్‌గా నిలవడానికి అవకాశం ఉంటుంది. పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరూ స్పెల్‌బీలో పాల్గొంటే ఎన్నో మేలకువలు నేర్చుకుంటారు.
– సమన్విత, 6వ తరగతి, క్రైడో స్కూలు, కర్నూలు

ఎన్నో కొత్త పదాలు నేర్చుకున్నా



స్పెల్‌బీ పరీక్షకు హాజరవ్వడం సంతోషంగా ఉంది. ఎన్నో కొత్త పదాలు నేర్చుకున్నా. కష్టమైన పదాలకు అర్థాలు ఎలా రాయాలో... అర్థాలు ఎలా నేర్చుకోవాలని తెలుసుకున్నాను. థ్యాంక్స్ టు 'సాక్షి'. ఇది నా భవిష్యత్‌కు ఎంతో ఉపయుక్తం.
– సత్యప్రియ, 8వ తరగతి, క్రైడో స్కూలు, కర్నూలు

మ్యాథ్స్ బీతో ఉన్నత స్థానం



మ్యాథ్స్‌బీ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. క్రమశిక్షణను పాటించేలా చేస్తుంది. ఈ పరీక్ష సామర్థ్యాలను అందుకునే విద్యార్థులు ఐఐటీ, నీట్‌లలో రాణించేందుకు అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో మంచి ప్రయోజనాలను పొందుతారు. విద్యార్థులకు ఇలాంటి నైపుణ్య పరీక్షలు ఎంతో అవసరం. – అంజుమ్‌పర్వీన్, టీచర్, రవీంద్రవిద్యానికేతన్, కర్నూలు

కార్లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- అరుణాచలం వెళ్లి వస్తూ రిటైర్డ్ ఎస్‌ఐ మృత్యువాత
- మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన చంద్రశేఖర్, ఖాదర్‌బాషా


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

శిరివెళ్ల: ఆళ్లగడ్డ–నంద్యాల జాతీయ రహదారిపై గోవిందపల్లె వేబ్రిడ్జి వద్ద ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలులోని సంతోషనగర్‌కు చెందిన సిగరం చంద్రశేఖర్ (67) అతని భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రవికుమార్ కలిసి అరుణాచలం వెళ్లేందుకు ఈ నెల 22న కారులో బయలుదేరారు. అక్కడ స్వామివారి దర్శనం ఆదివారం ఉదయం తిరుగుపయనమయ్యారు. అలాగే నంద్యాలలోని నడిగడ్డకు చెందిన యువకుడు శిరివెళ్లలోని తన అవ్వను చూడడానికి కారులో వెళుతున్నాడు. గోవిందపల్లె వద్దకు రాగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి కర్నూలు వైపు వెళ్తున్న రిటైర్డ్ ఎస్‌ఐ కారుపై దూసుకెళ్లింది. కారు డ్రైవింగ్ చేస్తున్న రిటైర్డ్ ఎస్‌ఐ చంద్రశేఖర్, మరో కారును నడుపుతున్న నంద్యాలకు చెందిన షేక్ ఖాదర్‌బాషా (22) అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్‌ఐ భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళ పరిస్థితి విషమించడంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఎస్‌ఐ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఖదర్‌బాషా పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదం ఇరు కుటుంబాలలో విషాదం మిగిల్చింది.

రూ.100కే కిలో చికెన్


మద్దూరు నగర్‌లో చికెన్ దుకాణం వద్ద గుమికూడిన మాంసం ప్రియులు

చికెన్ వ్యాపారుల మధ్య ఏర్పడిన పోటీ నగరంలోని మాంసం ప్రియులకు విందుగా మారింది. స్థానిక మద్దూరునగర్‌లోని షమీర్, సుభాన్ మాంసం దుకాణాల నిర్వాహకుల మధ్య ఆదివారం పోటీ ఏర్పడింది. దీంతో పోటాపోటీగా ధరలు తగ్గించేశారు. స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.220 ఉండగా రూ.100కే కేజీ విక్రయించారు. చౌకగా చికెన్ లభిస్తుండటంతో వినియోగదారులు చికెన్ కోసం పోటీ పడ్డారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి క్లియర్ చేయాల్సి వచ్చింది.
– కర్నూలు(అగ్రికల్చర్)

ఎరక్కపోయి ఇరుక్కున్న లారీ


కొత్త బస్టాండ్ సమీపంలో బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన పత్తి లారీ

షార్ట్‌కట్‌లో వెళ్లాలన్న తొందరపాటుతో ఊహించని రీతిలో లారీ ఇలా ఇరుక్కుపోవడంతో నగరవాసులకు ట్రాఫిక్ చుక్కలు కనిపించాయి. దీంతో లారీడ్రైవర్ అందరితో చీవాట్లు తింటూ పోలీసులకు అడ్డంగా బుక్కయ్యాడు. వివరాలు.. రాయచోటి నుంచి నంద్యాలకు పత్తి బేళ్ల లోడుతో బయలుదేరిన లారీ బైపాస్ రోడ్డులో వెళ్లకుండా షార్ట్‌కట్‌లో వెళ్లేందుకు బళ్లారి చౌరస్తా వద్ద నగరంలోకి ప్రవేశించింది. లోడ్ ఎక్కువ ఎత్తు ఉండడంతో కేసీ కెనాల్ బ్రిడ్జి అండర్ పాస్ కిందకు రాగానే లారీ అడ్డంగా ఇరుక్కుపోయింది. ఉన్న రెండు అండర్‌పాస్‌లలో ఒకటి లారీ ఇరుక్కొని బ్లాక్ కావడంతో ట్రాఫిక్ స్తంభిచింది. దీంతో వాహనదారులు ఒకే అండర్‌పాస్‌లో రాకపోకలు సాగిస్తూ ఐదారు గంటలపాటు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి పత్తి బేళ్లను కిందికి దించి లారీని వెనక వైపు నుంచి బయటకు తీయడంతో సమస్య పరిష్కారమైంది.
– కర్నూలు న్యూసిటీ

భర్తను చంపిన భార్య

కర్నూలు (టౌన్): వారిద్దరు ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఆరేళ్ల సంసార జీవితంలో పొరపొచ్చాలు వచ్చాయి. అంతే.. ఆదివారం ఉదయం భర్తను భార్య కడతేర్చింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ.. కర్నూలు మండల పరిధిలోని ప్రజానగర్‌లో కరగల్లు చిన్నా (25) కుటుంబం నివశిస్తోంది. భార్య స్వరూపారాణిని ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. చిన్నా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే దంపతులు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో ఆదివారం తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. క్షణికావేశానికి గురైన స్వరూపరాణి భర్త తలపై ఇనుప రాడ్‌తో పదే పదే కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం ఆమె నేరుగా తాలుకా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడి తల్లి పద్మావతి ఘటనా స్థలానికి చేరుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తాలుకా సీఐ శ్రీధర్ వెల్లడించారు.



రక్తపు మడుగులో చిన్నా మృతదేహం, నిందితురాలు స్వరూప రాణి

జింక చర్మం అక్రమ రవాణా ముఠా అరెస్ట్

- 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న జింక చర్మాలు, కొమ్ములను చూపుతున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు

వజ్రకరూరు: అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జింకలను వేటాడి చంపి.. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాన్ని అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వజ్రకరూరు పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగస్వామి.. ఫారెస్ట్ సెక్షన్ అధికారి కరీముల్లా, బీట్ ఆఫీసర్ సతీష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు పట్టణానికి చెందిన షికారి దేవరాజు, షికారి గోవిందు, అనంతపురం నగరానికి చెందిన షికారి బాబు, షికారి బాలరాజు, గుంతకల్లు మండలం ఆచారమ్మ కొట్టాలకు చెందిన వడ్డే పెద్దఅంజి గుంతకల్లు, వజ్రకరూరు, ఆలూరు, ప్యగిరి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో కత్తెరలు ఏర్పాటు చేసి జింకలను వేటాడేవారు. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాన్ని కర్ణాటకలోని బళ్లారి, కంప్లి, హొస్పేట్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 24 జింక చర్మాలు, రెండు కొమ్ములను సంచుల్లో వేసుకుని కర్ణాటక వైపు వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ అధికారులతో కలిసి వజ్రకరూరు మండలం కొనకొండ్ల సమీపంలోని బళ్లారి జాతీయ రహదారిలో వారిని పట్టుకున్నారు. నిందితులను ఆదివారం అనంతపురంలోని మొబైల్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న బ్రాహ్మణ నేతలు


కుర్ని వనభోజన కార్యక్రమంలో చిన్నారుల డ్యాన్స్


మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

వెల్లివిరిసిన ఆత్మీయత

కర్నూలు(అర్బన్): కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో ఆయా కులబాంధవుల ఆధ్వర్యంలో వన భోజనాల సందడి నెలకొంది. బంధువులు, స్నేహితులతో కలిసి వన భోజన కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. అత్యంత భక్తి ప్రపత్తులతో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ నేపథ్యంలో నగర శివారు ప్రాంతాలు, పలు దేవాలయాలు, ఇతర ప్రదేశాలు సందడిగా మారాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహం హోరెత్తింది.

నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ...

నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక హరిహర క్షేత్రం శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో కార్తీక వనభోజనం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన ముందుగా ధాత్రి (ఉసిరి చెట్టుకు) విశేష పూజలు నిర్వహించారు. వైద్య శిబిరంలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

కురువ సంఘం ఆధ్వర్యంలో ...

నగర శివారు పెద్దపాడు రోడ్డు బీరప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో కురువ సంఘం ఆధ్వర్యంలో 22వ కార్తీక వనభోజనాలను ఘనంగా నిర్వహించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామకృష్ణ, సిట్రా సత్యనారాయణమ్మ, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కల్లూరు తహసీల్దార్ కే ఆంజనేయులు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కే రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

కుర్ని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని సన్మానిస్తున్న వాల్మీకులు

కుర్ని (నేసే) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వెంగన్నబావి సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘం నగర కమిటీ అధ్యక్షుడు గడిగె ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మాదుగుండు కృష్ణయ్య హాజరయ్యారు. చిన్నారులు ఆటపాటలతో హోరెత్తించారు.

వాల్మీకి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ....

స్థానిక బళ్లారి రోడ్డులోని వెంకట్‌నాయుడు కల్యాణ మండపంలో వాల్మీకి సంఘం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే బీ.విరూపాక్షి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, సంజీవలక్ష్మి, మంజునాథ్, మురళీ, రామకృష్ణ, రామాంజనేయులు, మహేష్‌నాయుడు, తలారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో ...

కర్నూలు(అర్బన్): నగర శివారుల్లోని జి పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుకనున్న విజ్ఞాన పీఠంలో నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. న్యాయవాది రామచంద్రరావు, పత్తి ఓబులయ్య అతిథులుగా పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న మంత్రి సవిత

ఎమ్మిగనూరురూరల్: ఎన్డీఏ కూటమి బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. భక్త కనకదాసు జయంతి పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్లో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. కురవ సంఘం నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డెరల కార్తీక వనభోజనాలు

కర్నూలు న్యూసిటీ: వడ్డెర కులస్తుల కార్తీక వనభోజన కార్యక్రమం సోమవారం స్థానిక బళ్లారి రోడ్డులోని వై జంక్షన్ సమీపం నాగేంద్రనగర్ వడ్డెర కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు లక్ష్మి వేంకటేశ్వర వడ్డెర కుల సంఘం భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డెరలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మట్కా బీటర్ల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాలలో మట్కా బీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. త్రీటౌన్ సీఐ సూర్యమౌళి పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం మట్కా బీటర్లను అరెస్ట్ చేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మట్కా నిర్వహిస్తున్న శ్రీనివాసులు, చిన్న రామయ్య, శ్రీనివాసరెడ్డి, అన్వర్ బాషా, హరిజనవాడ పిచిక హనుమంతు, రహెమాన్‌లపై నిఘా ఉంచి పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి మట్కా చీటీలతో పాటు రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.